ఆక్రమణల తొలగింపు

విశాలాంధ్ర-కె కోటపాడు : స్థానిక పంచాయతీ స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపడుతున్న షెడ్డును తొలగించినట్లు కార్యదర్శి శ్రీను తెలిపారు. మండల కేంద్రం కే కోటపాడు లో బజారు స్థలం ఎప్పటినుండో ఖాళీగా ఉంది. ఒకప్పుడు ఆ స్థలంలో ప్రతిరోజు కూరగాయలు మాంసం చేపలు తదితర దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు చేపట్టేవారు. ఆ దుకాణాలకు పంచాయతీ ఆశీలు కూడా వసూలు చేసేవారు. కాలక్రమేణా కూరగాయలు దుకాణాలు మెయిన్ రోడ్డు వద్దకు చేరుకున్నాయి. అప్పటినుండి బజారు స్థలం ఖాళీగా ఉండిపోయింది. గ్రామానికి చెందిన పట్నాల రామచంద్రరావు అదే స్థలంలో వ్యాపారం నిమిత్తం ఒక షెడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి గురువారం తన సిబ్బందితో వెళ్లి నిర్మాణాన్ని తొలగించారు. ఇదిలా ఉండగా గ్రామంలో అనేక చోట్ల అక్రమ నిర్మాణాలు ఉన్నాయని వాటిని కూడా తొలగించాలని పట్నాల రామచంద్రరావు డిమాండ్ చేశారు.

శిథిలావస్థకు చేరిన గ్రంథాలయం

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర-నాతవరం : నాతవరం మండల కేంద్రంలో ఉన్న శాఖా గ్రంథాలయం ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. దీనిని 1987 సంవత్సరంలో అప్పటి యువజన సాంకేతిక విద్యా శాఖ మంత్రిగా ఉన్న చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రారంభించడం జరిగింది. ఆనాటి నుండి నేటి వరకు అనేకమంది విద్యార్థులు ఈ గ్రంథాలయం నందు చదువుకుని ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు పొంది ఉన్నారు. ప్రతిరోజు పాఠకుల సంఖ్య పెరుగుతూనే ఉంది. అయితే గ్రంథాలయం పైకప్పు దెబ్బతిని పెచ్చులు కింద పడడంతో ప్రమాదం వాటిల్లే అవకాశం ఉన్నది. గత కొన్ని రోజులుగా పూర్తిస్థాయి గ్రంథాలయ టీచర్ లేకపోవడంతో, ఇన్చార్జి టీచర్ గా రోలు గుంట మండలం నుండి వారంకు ఒకరోజు రావడంతో పాఠకుల సంఖ్య తగ్గుతూ వస్తుంది. అంతేకాకుండా గ్రంథాలయ పరిసర ప్రాంతం ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది, నేడు ఎండిపోయిన మొక్కలు చెట్లు దర్శనమిస్తున్నాయి. దీనిపై అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి, పూర్తిస్థాయిలో గ్రంథాలయ టీచర్ ను నియమించి, గ్రంథాలయం భవనం కొత్తది నిర్మించాలని పలువురు అంటున్నారు.

ఘనంగా శ్రీ ముత్యమాంబ పండగ అనుపు మహోత్సవం

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని సబ్బవరం పంచాయితీ, చినగొల్లలపాలెం గ్రామంలో గ్రామ ప్రజలు ఆరాధ్య దైవమైన శ్రీ ముత్యమాంబ పండగ అనుపు మహోత్సవం ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు ,గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు.గురువారం ఉదయం అమ్మవారికి దూప, దీప, నైవేద్యములతో ,ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, తమ తమ మొక్కులు చెల్లించుకున్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి , యువ నాయకులు గండి వంశీ దీప్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి తెలుగు యువత సెక్రెటరీ రోమాల చంద్రశేఖర్, ఉత్సవ కమిటీ నిర్వాహకులు వారిని దుశ్శాలువాళ్ళతో ఘనంగా సత్కరించారు. సాయంత్రం 4 గంటల నుండి సాముగరిడీలు, తప్పెటగుళ్ళు, బల్లవేషము కోయివేషముల కార్యక్రమములతో ఊరేగింపుగా బయలుదేరి పండుగ ఉత్సవములు వైభవంగా నిర్వహించారు. రాత్రి 9 గంటల నుండి రోమాల చంద్రశేఖర్ ఆర్థిక సహాయంతో డాన్స్ బేబీడాన్స్ భక్తులను బాగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మండల ఎన్డీఏ కూటమి నాయకులు, బలిరెడ్డి అప్పారావు, ఇందల రమణగారు, మామిడి శంకర్రావు మామిడి కొండజి, గండి దుర్గాప్రసాద్ , జనసేన మండల పార్టీ అధ్యక్షులు కర్రీ కనకరాజు , పల్ల తాతారావు ,బంతి కోళ్ల పద్మ ,సింగంపల్లి కృష్ణ ,కిల్లి వెంకట సత్యనారాయణ ,గొర్లి నూకరాజు తాటిపాముల శేఖర్, జెట్టి ప్రసాద్, పుర్రి కనకరాజు, గొంప అశోక్, కోరాడ సుధీర్, మేడపాటి రాము, పల్లి మంగరాజు, సబ్బవరపు రమణ, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు వీర మహిళలు పాల్గొనడం జరిగింది.

రాంకీ కమర్షియల్ హబ్ సమీపంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రారంభించిన విశాఖ ఫార్మాసిటీ ఎండి డా.పిపి లాల్ కృష్ణ

విశాలాంధ్ర-పరవాడ : జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో రాంకీ కమర్షియల్ హబ్ సమీపంలోని బస్ స్టాప్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేసారు. గురువారం విశాఖ ఫార్మాసిటీ ఎండీ డా"పిపి లాల్ కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఏటా పాదచారులు, వాహన దారులు, ఉద్యోగుల సౌలభ్యం కోసం సామాజిక బాధ్యతగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం పరిపాటిగా వస్తుందని పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఈ సంవత్సరం కూడా చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ చలివేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మజ్జిగ, మంచినీరు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, పాదచారులు, వాహనదారులు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ రావు భక్షి, లైజనింగ్ ఏజీఎం రాఘవరెడ్డి, రాంకీ ఫౌడేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయ, సురక్షిత విధానంలో మగ్గబెట్టిన మామిడిపండ్లను మాత్రమే విక్రయించాలి

జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్ : సాంప్రదాయ, సురక్షిత విధానంలో మగ్గబెట్టిన మామిడిపండ్లను మాత్రమే విక్రయించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింటు కలెక్టరు ఎమ్. జాహ్నవి అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎమ్. జాహ్నవి గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లాలో 12500 మంది రైతులు 20 వేల ఎకరాలలో మామిడి పంటను సాగుచేస్తున్నారని, సుమారు 50 వేల మెట్రిక్ టన్నులు పంటను ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. ఉద్యానశాఖ అధికారులు పండ్లను మగ్గబెట్టే సురక్షిత విధానాలపై రైతులకు, వ్యాపారులకు తెలియజేయాలని, సబ్బవరం మండలం పినగాడి వద్దగల రయిపనింగు ఛాంబర్లను వినియోగించుకొనే విధంగా ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ముఖ్యంగా మామిడి పండ్ల సీజను మొదలవుతున్న కారణంగా మానవులకు హానికలిగించే కాల్షియమ్ కార్బైడ్ ఉపయోగించి పండ్లు మగ్గబెట్టివిధానాన్ని పూర్తిగా అరికట్టాలని తెలిపారు. అందుకుగాను రైతులకు, అవగాహన కల్పించాలని, వ్యాపారులకు కార్బైడ్ వినియోగిస్తే తీసుకొనే చర్యలను గూర్చి తెలియజేయాలని తెలిపారు. ఆహార భద్రతా శాఖ సిబ్బంది అధికంగా శాంపిల్స్ సేకరించాలని, కార్బైడ్ వాడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలియజేయాన్నారు. జిల్లా పంచాయతీ శాఖ, మునిసిపల్ సిబ్బంది చిన్న వ్యాపారులకు కార్బైడ్ వినియోగం వలన కలిగే అనర్థాలను తెలియజేయాలని, రవాణాశాఖ సిబ్బంది మామిడి పండ్ల రవాణా వాహనాలను తనిఖీ చేయాలన్నారు. నర్సీపట్నం మరియు పాయకరావుపేట మార్కెట్ యార్డులు, విశాఖపట్నం రైతుబజార్లలో గల రయిపెనింగు చాంబర్లను వెంటనే వినియోగం లోనికి తీసుకురావాలని మార్కెటింగు శాఖ అదికారులను ఆదేశించినట్లు తెలిపారు.

డీసీసీ ఉపాధ్యక్షుడిగా సయ్యపురెడ్డి సత్యనారాయణ

నియామక పత్రం అందజేసిన డిసిసి అధ్యక్షులు మీసాల సుబ్బన్న

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా సుదీర్ఘకాలం కాంగ్రెస్‌లో పనిచేస్తూ గతంలో జడ్పిటిసి సభ్యుడిగా పోటీ చేసి ప్రస్తుతం వడ్డాది టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న వడ్డాదికి చెందిన సయ్యపురెడ్డి సత్యనారాయణ నియమితుల య్యారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షులు మీసాల సుబ్బన్న నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గురువారం వడ్డాదిలో స్థానిక విలేకరులతో సత్యనారాయణ మాట్లాడుతూ, పార్టీ అధిష్టానం తనకిచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనకు ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించిన ఏఐసీసీ పెద్దలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఏపీసీసీ అధ్యక్షులు వైయస్ షర్మిలారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహించడం చట్టరీత్యా నేరం

యలమంచిలి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్

విశాలాంధ్ర-యలమంచిలి : మండలం, మున్సిపాలిటీ పరిధిలో గల పెద్దపల్లి గ్రామంలో బెల్ట్ షాపుల నిర్వహణ నిమిత్తం గ్రామపాట నిర్వహిస్తున్నారని సమాచారం తెలియడంతో ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఈ. సోమయ్య వారి సిబ్బందితో పాటు అక్కడకు చేరగా, పెద్దపల్లి గ్రామంలో శ్రీ వేమ మాంబిక అమ్మవారి గుడి వద్ద గ్రామస్తులను సమాచారం అడుగగా అమ్మవారి పండుగ నిర్వహణ గురించి చర్చించామని ఎటువంటి బెల్టషాపుల నిర్వహణ నిమిత్తం గ్రామ పాట నిర్వహించ లేదు అని తెలిపారు. అనంతరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వాహ్ణచడం చట్టరీత్య నేరమని తెలిపి, ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహించినట్టు సమాచారం తెలిస్తే వెంటనే వారికీ తెలియచేయవలసిందనిదిగా కోరారు.

పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : హోంమంత్రి వంగలపూడి అనిత

విశాలాంధ్ర-నక్కపల్లి : అనకాపల్లి జిల్లాలో ఉన్న పాత్రికేయుల సమస్యలపై సాధ్యమైనంతవరకు పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత హామీ ఇచ్చారు నక్కపల్లి లో ఉన్న మంత్రి క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమం సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే అనకాపల్లి జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు పెంటకోట జోగినాయుడు ,కోరాడ చంద్రరావు ల నాయకత్వంలో రాష్ట్ర సీనియర్ నాయకులు సిహెచ్ఎల్బి స్వామి ,ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చింతల కిషోర్, పాయకరావుపేట నియోజకవర్గం ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు కోమర్తి గోవిందు, సత్యనారాయణ లతోపాటు జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి వెంకట అప్పారావు, కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే అక్రిడేషన్ కమిటీలను నియమించాలని సి ఎస్ ఆర్ నిధుల ద్వారా ప్రతి ఒక్క జర్నలిస్టుకి ప్రీమియం చెల్లించే విధంగా కృషి చేయాలని, రాష్ట్రంలో దాడుల నియంత్రణ కమిటీ ఏర్పాటు చేయాలని, జిల్లాలో అర్హత కలిగిన ప్రతి ఒక్క పాత్రికేయులకు ఇండ్ల స్థలాలు ఇల్లు మంజూరు చేయాలని, పాయకరావు పేట నియోజకవర్గంలో ఉన్న అర్హత కలిగిన పాత్రికేయులు అందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ,నక్కపల్లి మండలంలో గతంలో పట్టాలు ఇచ్చిన ఇండ్ల స్థలాలకు తక్షణమే స్థలాలు కేటాయించాలని కోరుతూ పలు సమస్యలు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆమె జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తానని హామీ ఇస్తూ రాష్ట్రంలో జర్నలిస్టులపై ఎటువంటి దాడులు జరిగిన ఉపేక్షించేది లేదని చెప్పారు. జర్నలిస్టుల పెట్టిన తప్పుడు కేసులను పూర్తిస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఏపీయూడబ్ల్యూజే నాయకత్వం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఏపీయూడబ్ల్యూజే నాయకులు సీనియర్ పాత్రికేయులు సత్యనారాయణ, విజయ్, అశోక్, గణేష్, అప్ప వెలగా లోవరాజు, సేనాపతి లోవరాజు, నాగేశ్వరరావు, సాక్షి గణేష్ లతోపాటు పలువురు ఉన్నారు.

నర్సీపట్నంలో నేటి సీపీఐ జిల్లా సదస్సును జయప్రదం చేయండి

దేశపాత్రునిపాలెంలో సదస్సు కరపత్రాలు విడుదల

విశాలాంధ్ర-పరవాడ : నర్సీపట్నంలో ఈ నెల 11న సీపీఐ ఆధ్వర్యంలో జరిగే రాజ్యాంగ రక్షణ - ప్రజాస్వామ్య పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు పిలుపు నిచ్చారు. ఈ సదస్సులకు సంబంధించిన కరపత్రాలను దేశపాత్రుని పాలెంలో గురువారం ఆయన విడుదల చేసారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ దేశ విముక్తికై సాగిన స్వాతంత్రోద్యమ కాలం నుండి బడుగు బలహీన వర్గాలు, పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ) మహెూజ్వల పోరాటాలు నిర్వహించిందన్నారు. దేశంలో కార్మిక, కర్షక, ఇతర శ్రమ జీవుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాలను నడపడం ద్వారా సమాజంలో గణనీయమైన మార్పులకు కృషి చేస్తోందన్నారు. కేంద్రంలో మోదీ ప్రధానిగా అధికారం చేపట్టిన నాటి నుంచి దేశం అన్ని రంగాల్లో వెనుకబాటు పట్టిందని, సామాన్యులు జీవించలేని స్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ పక్క నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతుండగా.. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెరుగుదలకు హద్దే లేకుండా పోయిందన్నారు. గతంలో రూ.70 ఉన్న పెట్రోలు ప్రస్తుతం రూ.112లకు, రూ.52 ఉన్న డీజిల్ రూ.100కు పైగా చేరగా, రూ.400 ఉన్న గ్యాస్ సిలెండరు ఇపుడు రూ.1100లకు పెరగడం ప్రజలపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో కనిపిస్తోందన్నారు. ఇంటి పన్నులు, ఆస్తి పన్నులు భారీగా పెంచాలని రాష్ట్రాలను బెదిరిస్తోందని, చివరికి చెత్త మీద కూడా పన్నులు వేసేలా చేస్తోందని విమర్శించారు. మరో పక్క విద్యుత్ సవరణ చట్టం పేరుతో విద్యుత్ బిల్లుల రూపంలో ప్రజలకు చుక్కలు చూపిస్తోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే విభజన చట్టం అమలు అటకెక్కించిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా విషయంలో ప్రధాని మోదీ చేసిన మోసాన్ని ఆంధ్రులెవరూ మర్చిపోలేరన్నారు. రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరం విషయంలో నిత్యం కొర్రీలు పెడుతూ ప్రాజెక్టు పూర్తి కాకుండా మోకాలు అడ్డుతూనే ఉందన్నారు. రాష్ట్రంలోని విజయవాడ, తిరుపతి, రాజమండ్రి విమానాశ్రయాలు, తిరుపతి, నెల్లూరు, విజయవాడ రైల్వే స్టేషన్లు, విశాఖ పోర్టులోని నాలుగు ప్రాజెక్టులు, ఎఫ్.సీ.ఐ గోదాములు, విద్యుత్ ఉత్పత్తి, ట్రాన్స్మిషన్ ప్రాజెక్టులు, కేజీ బేసిన్ గ్యాస్ పైప్లాన్, బీఎస్ఎన్ఎల్ టెలికాం టవర్లు, భారత్ నెట్ ఫైబర్ ఆప్టిక్ కేబుల్ నెట్వర్లను అమ్మకానికి పెట్టిందని, ఈ నేపథ్యంలో ప్రజానీకాన్ని మరింత పేదరికంలోకి నెట్టే విధంగా ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల్లో చైతన్యం నింపడం కోసమే నర్సీపట్నంలోని శ్రీకృష్ణ ప్యాలస్ నందు ఈ సదస్సును నిర్వహించడం జరుగుతుందని, ఈ ప్రచార ఆందోళన సదస్సును విజయవంతం చేయాలని ఈ సందర్భంగా దొరబాబు జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బూసి పరమేశ్వరి జి.లక్ష్మి, నారాయణమ్మ, ఆశ, తులసి తదితరులు పాల్గొన్నారు.

శ్రీను కుటుంబానికి అండగా ఉంటా : హోంమంత్రి అనిత

విశాలాంధ్ర-నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగోళ్ళు గ్రామానికి చెందిన దొంగల శ్రీను చిట్టీ పై నుండి పడిపోయి తీవ్ర గాయాలు అయిన సంగతి తెలిసిందే. ఈ మేరకు రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత గురువారం దొంగల శ్రీను ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీను ఆరోగ్యం పై ఆరా తీసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీను కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు. త్వరలోనే శ్రీనుకు ఆపరేషన్ చేయిస్తానని భరోసాను కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్ వెలగా శ్రీను వెలగా సుధాకర్ కురందాసు నూకరాజు కొప్పిశెట్టి బుజ్జి తదితరులు ఉన్నారు.

ఘనంగా డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్, జగజ్జీవన్ రామ్ విగ్రహాలు ఆవిష్కరణ

విశాలాంధ్ర-సబ్బవరం : జీవిఎంసి 88 వార్డులో వంగలపూడి గణేష్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ , డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్‌ల విగ్రహాలు ఆవిష్కరణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విశాఖ జిల్లా వైయస్ఆర్సిపి పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రివర్యులు, చోడవరం నియోజకవర్గం ఇంచార్జి గుడివాడ అమర్నాథ్, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే ఆదిప్ రాజ్ ,పెందుర్తి నియోజకవర్గం వైసిపి నాయకులు గండి రవి కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహ ఆవిష్కరణ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 88వార్డు ఇంచార్జ్ గండ్రెడ్డి మహాలక్ష్మి నాయుడు, 88 వార్డు అధ్యక్షుడు దాడి నూకరాజు, వంగలపూడి గణేష్, పట్నాల లక్ష్మణరావు, ములకలపల్లి అప్పారావు, ఐ.డి.బాబు, పెద్దఎత్తున డా.అంబేద్కర్ ఫాలోవర్స్, వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చారిత్రక తీర్పు వెలువరించిన చోడవరం కోర్టు... ప్రజా సంఘాలు హర్షం

ప్రభుత్వ న్యాయవాది (పీపి), ఏఎస్ఐలకు సత్కారం

విశాలాంధ్ర-చోడవరం : చోడవరం న్యాయస్థానాల సముదాయం చరిత్రలోనే ఇటీవల చారిత్రాత్మక తీర్పు వెలువడిన నేపథ్యంలో చోడవరం ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తూ.. అభినందనలు తెలిపాయి. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి లో 10 ఏళ్ల కిందట ఒక చిన్నారిని అతి కిరాతకంగా చంపిన సంఘటనలో ముద్దాయికి చోడవరం కోర్టు మరణ శిక్ష విధించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని.. అంతటి ప్రతిభ కనబరిచిన అడ్వకేట్ ఉగ్గిన వెంకట రావు, ఏఎస్ఐ అప్పల నాయుడులను అభినందిస్తూ వారిని సత్కరించేందుకు ఫోరం ఫర్ బెటర్ చోడవరం ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు ఆర్క్ ప్రసాద్ , బద్రి మహంతి వెంకట రావు నేతృత్వం లో ఫోరం ఉపాధ్యక్షులు అడ్వకేట్ టివి రమణ అధ్యక్షతన న్యాయవాదులు, ఉపాధ్యాయులు, సాహిత్య వేత్తలు, సామాజిక కార్యకర్తలతో ఒక అపూర్వ సంఘటన సమావేశం చోడవరం ప్రేమ సమాజం లో నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు తీర్పుని స్వాగతిస్తూ వారిద్దరిని ఘనంగా సత్కరించారు. నేటి సమాజంలో ఈ తీర్పు ఒక భరోసా,ఒక ధైర్యాన్ని ఇచ్చిందన్నారు.సత్వర తీర్పులు, కటినాతి కఠినమైన తీర్పులు రావడం కూడా అవసరం అని భావించింది.ముఖ్యం గా యువతలో వారి మానసిక స్థితిలో మార్పు రావాలన్నారు.అందుకు వారిలో వారితో,వారి తల్లి తండ్రులతో అనేక చైతన్య కార్య క్రమాలు నిర్వహిస్తూ..మరో పక్క కఠినమైన తీర్పులు శిక్షలు అవసరం అని వేదిక భావించింది..సన్మాన గ్రహీత అడ్వకేట్ వేంకట రావు మాట్లాడుతూ ఈ కేసు విజయం వెనుక ప్రభుత్వ న్యాయమూర్తులుకి ఎన్ని బెదిరింపులు ఎదురైనా సాక్షులు బలంగా నిలబడడం.. న్యాయమూర్తుల తీర్పులు.. పోలీసు శాఖ సహకారం వుందని ఈ సంఘటన వారిని సైతం కలచివేసిందన్నారు. ఒక సవాల్‌గా ఒక సామాజిక భాద్యతగా తీసుకుని చాలా జాగర్తగా చేపట్టడం జరిగిందని తెలిపారు. సమాజంలో కూడా ఇంతటి ఆదరణ ప్రోత్సాహం మమ్మల్ని మరింత భాధ్యు లుగా చేసిందని..ఫోరం ఫర్ బెటర్ చోడవరం సంస్థకు ధన్య వాదాలు తెలియ జేశాసారు..ఫోరం సభ్యులు న్యాయస్థానం తీర్పుని స్వాగతిస్తూ.. న్యాయవాది. వి పిఉగ్గిన వెంకటరావు, ఏఎస్ఐ అప్పలనాయుడు ప్రతిభని, కృషిని అభినందించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు కి అనకాపల్లి జిల్లా ఎస్పీ చేతులమీదుగా ప్రశంసా పత్రం పొందడం మరింత అభినందనీయం అని కొనియాడింది. సమావేశానికి దేముడు మాస్టారు, లక్కవరం సత్యన్నారాయణ మాస్టారు,తెలుగు పండితులు కొండల రావు,రామయ్య రెడ్డి,గుడిమెట్ల సత్యన్నారాయణ, దిబ్బిడి బిఈటీ త్రినాథ్ రాజు, గోవింద్ మాస్టారు, ప్రాత రాజశేఖర్, కన్నయ్య శెట్టి, సదాశివుని రాజు, ప్రేమ సమాజం రాజు, మోహన్ రాజు డిఫెన్స్, చినబాబు మాస్టారు ప్రెసిడెంట్ పెన్షనర్స్ అసోసియేషన్, బలరాం, అడ్వకేట్స్. చీపురుపల్లి సూర్య నారాయణ, కే.శ్రీనివాస్, జి శ్రీనివాస్, శ్రీనివాస్, వెంకటరావు, దొర, సూర్య, సతీష్, అప్పలనాయుడు, భూపతి రాజు, ఇతర పెద్దలు పాల్గొన్న అభినందించారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్ : డీఎస్పీ శ్రీనివాస్

విశాలాంధ్ర-నర్సీపట్నం : నర్సీపట్నం అయ్యన్న కాలనీలో జరిగిన హత్య కు సంబంధించి నిందితుడు చిత్రాడ మహేష్ ను అరెస్ట్ చేయడం జరిగిందని నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాస్ వెల్లడించారు. గురువారం నర్సీపట్నం టౌన్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో హత్యకు సంబంధించి వివరాలు డీఎస్పీ తెలియజేశారు. 2025 ఏప్రిల్ 8వ తేదీన రాత్రి అయ్యన్న కాలనీలో తలుపులమ్మ తల్లి పండగ సంద ర్భంగా రాత్రి స్టేజ్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. స్టేజ్ ముందు డ్యాన్స్ వేసుకుంటున్న రుత్తల దుర్గాప్రసాద్ తన స్నేహితులైన సాయి, భార్గవ్‌లు మరికొంతమంది మరియు డ్యాన్స్ వేసుకుంటున్నారు. అదే సమయంలో నిందితుడు అయిన చిత్రాడ మహేష్, రుత్తల దుర్గాప్రసాద్ వారితో గొడవపడ్డారు. అప్పుడు సమయం రాత్రి 11 గంటలు అవుతుంది. అక్కడ పండగ బందో బస్తు చేస్తున్న పోలిస్ వారు మరియు పెద్దలు అందరు వారి గొడవని సద్దుమణిగించి అక్కడ నుండి పంపివేసారు. అంతట నిందితుడు చిత్రాడ మహేష్ అది మనసులో పెట్టుకొని ఎలాగైనా చంపుదామని నిర్ణయించుకొని వారి ఇంట్లో ఉన్న పదునైన చాకును పట్టుకొని, రాత్రి సుమారు 1:00 గం.ల సమయంలో దుర్గాప్రసాద్ అన్నయ్య ఇంటి ముందుకు వెళ్ళి దుర్గాప్రసాద్ తన స్నేహితులతో ఉండగా అది చూసి మరలా దుర్గాప్రసాద్‌ను రెచ్చగొట్టే విధంగా ఇష్టం వచ్చినట్లు తిట్టాడు. అతను ఇంటి వద్ద దుర్గాప్రసాద్ యొక్క ఎడమ చాతి, చాతి మధ్య భాగమున 3సార్లు పొడిచాడు. అదే సమయంలో అతని స్నేహితుడు షణ్ముఖ్ సాయి తనని అడ్డుకొనే ప్రయత్నం చేయగా అతనిని కూడా తన కడుపు భాగంలో, తొడ పైన పొడిచి గాయపరిచినాడు. వెంటనే క్షతగాత్రుడిని నర్సీపట్నంలో శ్రీహర్ష ఎమర్జెన్సీ కేర్ తీసుకువెళ్ళగా అప్పటికే చనిపోయినట్లు డాక్టర్ నిర్ధారించారని డీఎస్పీ శ్రీనివాస్ వివరించారు. మరుసటి రోజు 2025 ఏప్రిల్ 9వ తేదిన ఉదయం ఈ ఘటనకు సంబం ధించి మృతుని తల్లి నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దానిపై, ఇన్స్పెక్టర్, నర్సీపట్నం టౌన్ క్రైమ్ నెంబర్ 75/2025 యు/ఎస్ 103(1), 118(1) బిఎన్ఎస్ యాక్ట్ గా కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా ఇన్స్పెక్టర్, నర్సీపట్నం టౌన్ పోలీస్ మరియు వారి సిబ్బంది కలసి ఈరోజు 10వ తేదీ న నిందితుడు చిత్రాడ మహేష్ (24)ను అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసిన అనంతరం అతనివద్ద నుంచి హత్య చేయడానికి ఉపయోగించిన చాకు ను పోలీసులు స్వాధీన పరుచుకున్నట్టు వివ రించారు. ఇదేకాకుండా నిందితుడు చిత్రాడ మహేష్ పై నర్సీపట్నం టౌన్ స్టేషన్ లో పాత కేసు కూడా ఉంది. నిందితుడును కోర్టు లో హాజరు వరుస్తామని డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో టౌన్ సిఐ గోవింద రావు తదితరులు పాల్గొన్నారు.

చెదపురుగుల మందు సేవించి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-సబ్బవరం : మండల కేంద్రంలోని పాత సబ్బవరం గ్రామానికి చెందిన ఓవ్యక్తి అనుమానస్పదస్థితిలో మృతి చెందినట్లు స్థానిక సి.ఐ పిన్నింటి రమణ తెలిపారు.వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని పాత సబ్బవరం గ్రామానికి చెందిన ఎంద్ర అర్జున్(42) పాత సబ్బవరం గొర్లివానిపాలెం గ్రామంలో గత పదిహేళ్లుగా అదే గ్రామంలో కళాసి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని, ఈ నెల 7న మృతుడు మద్యం సేవించి అనంతరం అలీమా టెస్ట్ అనే చెద పురుగుల మందును త్రాగడం తో అది గమనించిన కుటుంబ. సభ్యులు కేజీహెచ్ కు తరలించగా, చికిత్స పొందుతూ తొమ్మిదవ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటన్నర సమయంలో మృతి చెందినట్లు మృతుని భార్య రాము ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.మృతునికి కుమారుడు వంశీ 17 సంవత్సరాలు ,కుమార్తె మేఘన 16 సంవత్సరాలు ఉన్నారని భార్య ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుని భార్య ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వడ్డాదిలో తాగునీటి బోరుకు జడ్పిటిసి శంకుస్థాపన

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : మండలంలో వడ్డాది పాడి రైతుల కల్లాల వద్ద తాగునీటి బోరును ఏర్పాటు చేయాలన్న రైతుల కోరిక మేరకు గురువారం జడ్పీటీసీ దొండా రాంబాబు త్రాగునీటి బోరు నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పాడి రైతులు వ్యవసాయ కల్లాల వద్ద తాగునీటికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో జడ్పీటీసీ నిధులతో బోర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, పాడి రైతులు పాల్గొన్నారు.

సరుగుడు రైతుల ఆవేదనను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా : కలిమి శ్రీను

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : మండలంలో చింతపాక గ్రామంలో నిన్న జరిగిన అగ్నిప్రమాదంలో సుమారుగా 40 ఎకరాల సరుగుడు తోట దగ్ధమైన శీర్షికపై కూటమి నాయకులు కలిమి శ్రీను ఆధ్వర్యంలో అగ్ని ప్రమాద పరిసరాలను అధికారులతో కలిసి పరిశీలించారు అగ్ని ప్రమాదం వలన నష్టపోయినటువంటి రైతులను పరామర్శించి వారికి ప్రభుత్వం తరఫున నష్టపరిహారం చేకూర్చడానికి తన వంతు కృషిగా స్థానిక శాసనసభ్యులు కే ఎస్ ఎన్ ఎస్ రాజు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి కోటీశ్వరరావు వీఆర్ఏలు రమణ, శ్రీనుతోపాటు చింతపాక కూటమి నాయకులు, పిల్లాఅబ్బులు. త్రినాద్ కోట్నీలక్ష్మీరావు, సత్యరావు గోవింద. సన్యాసిరావు లోవ, నూకేష్. గణేష్. నాగేష్, రమణ, భూషణం, అప్పారావు. కళ్యాణం.పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ చైర్మన్‌గా రమేష్

విశాలాంధ్ర-వి.మాడుగుల : మాడుగుల వాసవి క్లబ్ చైర్మన్‌గా కొట్యాడ రమేష్‌ను ఎంపిక చేశారు. ప్రస్తుతం వాసవి క్లబ్ చైర్మన్‌గా పాలకుర్తి సర్వారావు బాధ్యతలు నిర్వహిస్తుండగా ఆయన స్థానంలో కొట్యాడ రమేష్‌ను వాసవి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో నియమించారు. గురువారం సాయంత్రం శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో రమేష్ ప్రమాణ స్వీకారం చేస్తున్నట్టు న్యూస్ లీడర్‌కు తెలిపారు.

నర్సీపట్నం ట్యాంక్ బండ్‌ను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేస్తాం

విశాలాంధ్ర-నర్సీపట్నం : నర్సీపట్నం ట్యాంక్ బండ్‌ను పర్యాటక హబ్‌గా తీర్చి దిద్దుతామని టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా 6, 7, 9వ వార్డుల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి సంబంధించిన 7 పనులకు గురువారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ వరుసగా నాలుగో రోజు కూడా పాల్గొన్నారు. ప్రతి వార్డులో స్థానిక మహిళలు హారతులతో స్వాగతం పలికారు. వార్డు వాసులు పెద్దఎత్తున హాజరై అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసించారు. మున్సిపాలిటీలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఏడో వార్డు శంకుస్థాపన అనంతరం చింతకాయల విజయ్ మాట్లాడుతూ ఏడో వార్డు తెలుగుదేశం పార్టీకి కంచుకోట అని పేర్కొన్నారు. మూడు వార్డుల కలిపి సుమారు రూ.54 లక్షల విలువైన పనులకు నిధులు కేటాయించామని, ఒక్క ఏడో వార్డులోని ఒకే ఒక్క రోడ్డుకు రూ.46 లక్షలు కేటాయించామని, త్వరలోనే అక్కడ కూడా శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. గత ప్రభుత్వంలో కొబ్బరికాయ కొట్టే కార్యక్రమాలకే పరిమితమైందని, కానీ తమ ప్రభుత్వం కొబ్బరికాయ కొట్టిన ప్రతీ పనిని పూర్తి చేస్తుందని అన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు గత 8 నెలల కాలంలో రూ.20 కోట్లు అభివృద్ధి నిధులు తీసుకొచ్చారని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చనున్నట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఖాళీ స్థలాలు చెత్తతో నిండిపోయి డంపింగ్ యార్డుల్లా మారుతున్నాయని, వర్షాకాలంలో వాటిలో నీరు నిలిచి చెరువుల్లా తయారవుతున్నాయని తెలిపారు. దీనివల్ల పక్కన నివసించే ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే

ప్రమాదం ఉందని, స్థల యజమానులకు మున్సిపాలిటీ తరఫున నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. నర్సీపట్నం ట్యాంక్‌బండ్‌ను ఒక పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయనున్నట్లు కూడా తెలియజేశారు. కార్యక్రమంలో ఆరో వార్డు ఇన్‌ఛార్జ్ మార్కెట్ రాజా, మల్ల నాగేశ్వరరావు, సూరిబాబు, ఏడో వార్డు కౌన్సిలర్ రావాడ లక్ష్మి, రావాడ నాయుడు, ఇతర వార్డు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో ఫిర్యాదుల వెల్లువ

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా : హోం మంత్రి అనిత

విశాలాంధ్ర-నక్కపల్లి : ప్రజా సమస్యల పరిష్కారమే ఏకైక అజెండాగా హోంమంత్రి వంగలపూడి అనిత ప్రజాదర్బార్ గురువారం నిర్వహించారు. అర్జీదారులను నేరుగా కలిసి, ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ, వారి గోడు వింటూ, వినతులు స్వీకరించారు. హోంశాఖకు సంబంధించిన సమస్యలపై అప్పటికప్పుడు సంబంధిత శాఖ అధికారులను పరిష్కారం దిశగా ఆదేశించారు. ప్రతి ఒక్కరి సమస్యను శ్రద్ధగా వింటూ పరిష్కారం చేస్తానని హోంమంత్రి హామీ ఇచ్చారు. పాయకరావుపేట నియోజకవర్గ ప్రజల కోసం తన కార్యాలయం ద్వారాలు తెరిచే ఉంటాయని ఎప్పుడైనా కలిసి సమస్యలను తన దృష్టికి తీసుకురావచ్చని ఆమె ప్రజలకు వెల్లడించారు.తక్షణమే సమస్యల పరిష్కారానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చెయ్యాలని అధికారులను ఆదేశించారు. సమస్యలో ఉన్న ప్రజల కన్నీరు తుడుస్తూ..వారి కష్టాలు తీరుస్తానంటూ హోం మంత్రి వంగలపూడి అనిత భరోసానిచ్చారు. ప్రతి సమస్యకూ పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని స్పష్టం చేశారు. నక్కపల్లి మండలం సారిపల్లిపాలెం హోం మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద గురువారం హోంమంత్రి ప్రజదర్భార్ నిర్వహించారు. అనకాపల్లి జిల్లాలో వివిధ నియోజకవర్గాలు, పాయకరావుపేట నియోజకవర్గం

నాలుగు మండలాలు నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వారితో ఆప్యాయంగా మాట్లాడి హోంమంత్రి అనిత సమస్యలు తెలుసుకున్నారు. ఈ గ్రీవెన్స్ కార్యక్రమానికి సుమారు 600కు పైగా అర్జీలు వచ్చాయన్నారు. భూమి సమస్యలు, కొత్త ఫించన్లు,రేషన్ కార్డులు, కుటుంబ కలహాల నేపథ్యంలో కేసులు తదితర అంశాలపై అధికంగా ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. పరిష్కారానికి అవకాశం ఉన్న కొన్ని అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అక్కడికక్కడే పరిష్కరించారు.

వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

నిర్వాసితులు డిమాండ్

విశాలాంధ్ర-నక్కపల్లి : మండలంలో గురువారం చందనాడలో ఈరోజు వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పై తుఫాన్ భవనం లో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం ఆర్డిఓ వివి రమణ మాట్లాడుతూ నిర్వాసితులు సమస్యలు త్వరితగతిన పూర్తి చేసి ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నదని, అందువల్ల నిర్వాసితులకు 2013 భూ సేకరణ ప్రకారం 2024 డిసెంబర్ 31 నాటికి పద్దెనిమిది సంవత్సరాలు నిండి ప్యాకేజీ కి అర్హులుగా చందనాడ, తమ్మయ్యపేట,తుమ్మల పేట గ్రామంలో 346 మంది లబ్ది దారులు వచ్చారని వీరి కి ఒక్కొక్కరికి ఎనిమిది లక్షల ముప్పై ఆరు వేల రూపాయలు ప్యాకేజీ, పెద్ద బోదుగాలం రెవెన్యూ లో 5 సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని తెలిపారు,ఇతర భూమి సమస్యలు పరిష్కారం చేస్తామని తమ్మయ్యపేట,తుమ్మల పేట లో తొలగింపులో ఉన్న ఇల్లులకు త్వరలో నే నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపారు,ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, వైయస్సార్ సిపి నాయకులు వీసం రామకృష్ణ మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి నిర్మాణ

ఖర్చు లు పరిగణనలోకి తీసుకుని పద్దెనిమిది సంవత్సరాలు నిండిన వారికి ఇరవై ఐదు లక్షలు రూపాయలు, రైతుల దగ్గర భూములు స్వాధీనం చేసుకోవడం వలన ఉపాధి కోల్పోతున్న కూలీలు, వృత్తిదారులకు, దళితులకు పదిహేను లక్షలు రూపాయలు ప్యాకేజీ చెల్లించాలని, అర్హత ఉన్న వారు కి అవార్డు ప్రకటించిన తేదీ నాటికి పద్దెనిమిది సంవత్సరాలు నిండి వివాహం అయిన మహిళలకు కూడా ప్యాకేజీ ఇరవై ఐదు లక్షలు రూపాయలు చెల్లించాలని అలా అయితే మరలా పునరావాసం కల్పించే ప్రాంతంలో ఇల్లు నిర్మించుకోగలమని లేకపోతే ఇల్లు నిర్మించు కోలేక ఇక్కడ నివాసాలు కోల్పోయి తీవ్రంగా నష్టపోతామని ఆవేదన చెందారు,

పరిశ్రమలు అభివృద్ధి కోసం భూములు, జీవితాలు త్యాగం చేస్తున్న మా సమస్యలు పరిష్కారం చూపకుండా నిర్మాణాలు ప్రారంభించారని, పరిశ్రమలకు భూములు కేటాయించారని ఇది ఎంత వరకు సమంజసమని నిర్వాసితులు అందరూ మమ్మల్ని ఆదుకోవాలని ముక్తకంఠంతో ఆర్డీవో ను కోరారు. దీనిపై స్పందించిన ఆర్డీవో మాట్లాడుతూ ప్యాకేజీ పెంచే విషయం వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని, అర్హత కలిగి ప్యాకేజీ లిస్ట్ లో పేర్లు లేని వారు వారం రోజులో దరఖాస్తు చేసుకోవాలి తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహా మూర్తి, గ్రామ సర్పంచ్ తళ్ళరోహిణి భార్గవ్,చందనాడ ఎం పి టి సి గంటా తిరుపతిరావు, అమలాపురం సర్పంచ్ శంకర్రావు సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, పుణ్యమంతుల బాబూజీ, రోకళ్ళ గోవిందరావు, పుణ్యమంతుల సత్తిబాబు, తళ్ళ అప్పలస్వామి ,సూరకాసుల పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం కూలీలకు బకాయిలు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని ఉపాధి హామీ పథకం కూలీలకు గత నాలుగైదు నెలలుగా బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మండల సిపిఎం పార్టీ కార్యదర్శి ఉప్పాడ సత్యవతి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె బంగారమ్మ పాలెం గ్రామంలో గురువారం ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఉపాధి కూలీలకు గత నాలుగైదు నెలల నుండి సుమారు నాలుగు కోట్ల రూపాయలు మేరకు బకాయిలు ఉన్నాయని, వెంటనే ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే మేట్ల కు గత ప్రభుత్వంలో వేతనాలు ఉండేవని నేడు కూటమి ప్రభుత్వం హయాంలో మేట్లకు వేతనాలు లేకుండా చేశారని, మేట్లకు కూడా కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి కూలీలకు వేసవి అలవెన్స్ కింద మెడికల్ కిట్లు,టెంట్లు, మజ్జిగ, నీరు వంటి సదుపాయాలను ఏర్పాటు చేసి అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు పప్పుల కోటేశ్వరరావు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారుల తనిఖీపై స్పెషల్ డ్రైవ్

విశాలాంధ్ర-గొలుగొండ : వాహనాలను తనిఖీలు నిమిత్తం స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని గొలుగొండ ఎస్సై పి రామారావు తెలిపారు. గురువారం మండలంలో వివిధ ప్రాంతాల్లో ఈ వాహన తనిఖీలను చేపట్టారు. వాహనదారుల యొక్క రికార్డులు లైసెన్సు ఇన్సూరెన్స్ పొల్యూషన్, హెల్మెట్ వంటి వాటిని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రహదారులపై ప్రయాణించేటప్పుడు ప్రతి వాహనదారుడు అన్ని రికార్డులు కలిగి ఉండాలని ఆయన తెలిపారు అలాగే ఆటో డ్రైవర్లు అన్ని రికార్డులతో పాటు యూనిఫాం కూడా తప్పనిసరిగా ధరించాలని ఆయన సూచించారు. అలాగే వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణాలు చేయకుండా తమ గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా యువత రాష్ డ్రైవింగ్ వంటి వాటికి పాల్పడినట్లయితే కఠిన చర్యలు తీసుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సంఘానికి కేటాయించిన స్థలాన్ని అమ్మడం సరికాదు

- భవనం నిర్మాణం చేయకపోతే పంచాయతీకి స్థలాన్ని అప్పజెప్పాలని డిమాండ్
- పంచాయతీ నాయకుల ఆదేశాలను దిక్కరిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాది దొరబాబు కాలనీలో ఉపాధ్యాయ సంఘానికి కేటాయించిన గ్రామ కంఠం స్థలాన్ని ఉప సర్పంచ్ దాడి సూర్య నాగేశ్వరరావు, టీడీపీ టౌన్ అధ్యక్షుడు దొండా నరేష్, జనసేన సీనియర్ నేత అడపా నరసింహమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. సత్యనారాయణ తదితర గ్రామ నాయకులంతా గురువారం సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ1999లో సర్వేనెంబర్ 49లో 3 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘానికి కేటాయించారని సంబంధిత స్థలంలో భవనం నిర్మించుకొని సంఘ కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి వీలుగా అప్పటి ప్రభుత్వంలో ఏపీటీఎఫ్ సంఘం పేరిట పట్టా మంజూరు చేశారన్నారని సంబంధిత స్థలాన్ని ఇటీవల స్థానికంగా ఓ ప్రైవేటు వ్యక్తికి ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు అమ్మకం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఉపాధ్యాయ సంఘానికి కేటాయించిన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్మడం చట్టరీత్య నేరమని తెలిపారు. ఒకవేళ భవనం నిర్మించకపోతే ఆ స్థలాన్ని పంచాయితీకి అప్పగిస్తే సంబంధించిన అధికారులు ఆ స్థలాన్ని ప్రజాప్రయోజనాలకు వినియోగానికి ఉపయోగిస్తారని అంతేగాని ఎవరైనా ఈ స్థలాన్ని కొనినా, అమ్మినా చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు భవనం నిర్మించుకోకపోతే స్థలాన్ని తక్షణమే పంచాయతీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎస్.మాధవరావు, ఎస్ఎంసి చైర్మన్ కోవెల వెంకటరమణ, తలారి శంకర్, అక్కిరెడ్డి కనక, సూరిబాబు పాల్గొన్నారు.